ఆదివాసీ స్థితిగతులపై ప్రత్యేక సమావేశం

మాట్లాడుతున్న ప్రొఫెసర్ పాండురంగారావు, ఆదివాసీ నాయకులు

తిర్యాణి, ఫిబ్రవరి 20 : ఆదివాసుల స్థితిగతులు, భవిష్యత్ ప్రణాళికలపై వరంగల్ జిల్లా కేంద్రంలో రాష్ట్రంలోని ఆదివాసీ సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశానికి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచి ఆయా సంఘాల నాయకులు హాజరైనట్లు జిల్లా సార్‌మేడి కుర్సెంగ మోతీరాం, రాజ్‌గోండ్ సేవా సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి మడావి గుణవంత్‌రావ్ తెలిపారు. ఈ సమావేశానికి రామప్ప దేవాలయాన్ని యూనిస్కో వరకు తీసుకెళ్లి, ప్రపంచానికి తెలియపర్చిన ప్రొఫెసర్ పాండురంగారావు ముఖ్య అతిథిగా హాజరైనట్లు తెలిపారు. సాగు, తాగు నీరు, విద్య, వైద్యం, వ్యవసాయం, సంస్కృతీ సంప్రదాయం, ప్రకృతి దేవుళ్లు, సాంస్కృతిక కార్యక్రమాలు తదితర అంశాలపై చర్చ జరిగినట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఆదివాసీ గోండ్ రత్న సిడాం అర్జు, రాజ్‌గోండ్ సేవా సమితి జిల్లా కార్యదర్శి మరప పాండ్‌రంగ్, ఊట్నూర్ బీఎడ్ కళాశాల ప్రిన్సిపాల్ మెస్రం మనోహర్, మంచిర్యాల జిల్లా సార్‌మేడి హన్మంతరావ్, కుంరం విఠల్, ఆర్క వసంతరావు, పేస కో-ఆర్డినేటర్ మడావి నర్సింగరావు, ఆయా ఆదివాసీ సంఘాల నాయకులు పాల్గొన్నట్లు వారు వివరించారు.

జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోండి

వాంకిడి, ఫిబ్రవరి 20 : ఎస్పీ సరేశ్ కుమార్ ఆధ్వర్యంలో ఆసిఫాబాద్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 26వ తేదీన నిర్వహించనున్న మెగా జాబ్‌మేళాను నిరుద్యోగ యువతీయువకులు సద్వినియోగం చేసుకోవాలని ఎస్ఐ డోలకసి సాగర్ సూచించారు. ఈ మెగా జాబ్‌మేళాకు 50 పైగా కంపెనీలు హాజరు కానున్నట్లు తెలిపారు. సుమారు వెయ్యికి పైగా ఉద్యోగాలు కల్పించేందుకు జిల్లా పోలీస్ శాఖ ఏర్పాట్లు చేసిందన్నారు. పది, ఇంటర్, డిగ్రీ, డిప్లొమా, బీఫార్మా, ఎంఫార్మా, బీటెక్, ఎంటెక్, బీఏ, బీఎస్సీ, బీకాం, ఎంబీఏ, ఎంసీఏ, ఎంఎస్సీ, ఎంసీఎస్ చదివిన యువతీయువకులు హాజరుకావచ్చని తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు బయోడేటా, ఆధార్ కార్డు, విద్యార్హత సర్టిఫికెట్లు, ఎక్స్ పీరియన్స్ సర్టిఫికెట్లు మూడు సెట్ల జిరాక్స్ కాపీలతో పాటు 4 పాస్ ఫొటోలతో హాజరవ్వాలని సూచించారు.

విద్యార్థులకు అవగాహన..

కౌటాల, ఫిబ్రవరి 20 : కౌటాల మండల కేంద్రంలోని చైతన్య డిగ్రీ కళాశాలలో జాబ్ మేళాపై విద్యార్థులకు సీఐ సాదిక్ పాషా అవగాహన కల్పించారు. జాబ్ మేళాలో అర్హత ఉన్న ప్రతి యువకులు భాగస్వాములై ఉపాధి, ఉద్యోగ అవకాశాల్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. చదువుతున్న ప్రతి ఒక్కరూ ఇలాంటి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆయా ఉద్యోగాల కోసం సిద్ధమవుతున్న, తమకు తెలిసిన ప్రతి ఒక్కరికీ ఈ విషయం తెలియజేయాలని విద్యార్థులకు సూచించారు. ఆయన వెంట ఎస్ఐ మధూకర్, కళాశాల ప్రిన్సిపాల్ సంఘ కిరణ్ కుమార్ ఉన్నారు.

ఆసిఫాబాద్, ఫిబ్రవరి 20 : జాబ్ మేళాపై జిల్లా కేంద్రంలోని ప్రధాన కూడలిలో వాల్ పోస్టర్లను అంటించి ఎస్ఐ మహేందర్ నిరుద్యోగ యువతీయువకులకు అవగాహన కల్పించారు. ఈ జాబ్ మేళాను నిరుద్యోగ యువతీ, యువతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆయన వెంట పోలీస్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

విజేతలకు బహుమతులు

లింగాపూర్, ఫిబ్రవరి 20 : మండలంలోని గుంనూర్ గ్రామంలో సంక్రాంతి సందర్భంగా నిర్వహించిన క్రికెట్ టోర్నీలో విజేతలకు మంగళవారం బహుమతులు అందజేసినట్లు క్రీడల నిర్వాహకులు కనక మాన్కు, ఆత్రం రాధాబాయి తెలిపారు. మొత్తం 40 జట్లు పాల్గొన్నాయి. కంచన్‌పల్లి, జైనూర్ లెవన్ పటేల్ జట్లు విజేతలుగా నిలిచాయి. బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు ఆత్రం అనీల్ కుమార్ చేతుల మీదుగా బహుమతులు అందజేసినట్లు తెలిపారు. కార్యదర్శి కనక బారిక్‌రావు, జంగుపటేల్, ఆత్రం గోవిందరావు, ఆత్రం రజనీకాంత్, గ్రామ పటేళ్లు పాల్గొన్నారు.

జాతర విజయవంతం చేయాలి

- భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించాలి
- ఆసిఫాబాద్ కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు
- శ్రీ బాలాజీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో అధికారులతో సమీక్ష

మాట్లాడుతున్న కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు

రెబ్బెన, ఫిబ్రవరి 20 : ఈ నెల 23 నుంచి 25వ తేదీ వరకు నిర్వహించనున్న గంగాపూర్ జాతరను విజయవంతం చేయాలని కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు అధికారులను ఆదేశించారు. మంగళవారం గంగాపూర్ గ్రామ శివారులోని బాలాజీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారీ, వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. జాతరకు వచ్చే భక్తులకు ఇబ్బందులేకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలన్నారు. రెండు మెడికల్ క్యాంప్‌లు ఏర్పాటు చేయాలని, 24 గంటల పాటు పారిశుధ్య సిబ్బంది విధులు నిర్వహించాలని, విద్యుత్ సమస్య తలెత్తకుండ జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. రైల్వే గేట్ సమస్య అధికంగా ఉండడంతో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు పరిశీలించాలని, సీసీ కెమెరాల్లో త్యం పర్యవేక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీవో సురేందర్, డీపీవో ఉమర్, డిప్యూటీ డీఎంహెచ్‌వో సుధాకర్‌నాయక్, బెల్లంపల్లి ఏరియా జీఎం రవిప్రసాద్, ఎంపీపీ జుమ్మిడి సౌందర్య, జడ్పీటీసీ వేముర్ల సంతోష్, పీఏసీఎస్ చైర్మన్ కార్నాథం సంజీవ్‌కుమార్, తహసీల్దార్ జ్యోత్న, ఎంపీడీవో శంకరమ్మ, సీఐ చిట్టిబాబు, ఎస్ఐ చంద్రశేఖర్, ఏఈ ఇమ్రాన్, ఎంపీవో రాజేశ్వర్‌గౌడ్, ఈవో బాపురెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కొక్కిరాల విశ్వప్రసాద్‌రావు, నియోజకవర్గ ఇన్‌చార్జి అజ్మీర శ్యాంనాయక్, గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు మోడెం సుదర్శన్ గౌడ్, నాయకులు గంటుమేర, లావుడ్య రమేశ్, జుమ్మిడి అనందరావు, మోడెం చిరంజీవిగౌడ్, దుర్గం దేవాజీ ఉన్నారు.

పార్లమెంట్ ఎన్నికలపై రాజకీయ పార్టీల నాయకులతో సమీక్ష

ఆసిఫాబాద్, ఫిబ్రవరి 20 : కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ దీపక్ తివారీ, ఆర్డీవో లోకేశ్వర్‌రావుతో కలిసి వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో పార్లమెంట్ ఎన్నికల నిర్వహణపై కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎన్నికలు జిల్లాలో సజావుగా సాగేందుకు రాజకీయ పార్టీలు తమ సహకారం అందించి, అధికార యంత్రాంగంతో కలిసి పని చేయాలని తెలిపారు. సిర్పూర్, ఆసిఫాబాద్ నియోజకవర్గాల్లో అవసరమైన ఏర్పాట్లతో సిద్ధంగా ఉన్నామని, భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లాలో చేపట్టిన ఓటరు జాబితా సవరణ కార్యక్రమం-2024లో భాగంగా తుది ఓటరు జాబితా విడుదల చేయడం జరిగిందన్నారు. జిల్లాలో ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా సహాయక పోలింగ్ కేంద్రాల ఏర్పాటుపై చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. బూత్‌స్థాయి ఏజెంట్లను నియమించి బూత్‌స్థాయి అధికారులకు అవసరమైన సూచనలు, సలహాలు అందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సహాయక పోలింగ్ కేంద్రాల ఏర్పాటు కోసం నివేదికను భారత ఎన్నికల సంఘానికి పంపినటుల, సంబంధిత అనుమతులు జారీ అయిన వెంటనే ఏర్పాటుకు చర్యలు తీసుకోనున్నట్లు వెల్లడించారు. ఈ సమావేశంలో ఎన్నికల విభాగం అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఆరు గ్యారెంటీల అమలెప్పుడు..?

- ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి
- నార్నూర్, గాదిగూడ మండలాల్లో లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ



చెక్కులు అందుకున్న లబ్ధిదారులతో ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి

నార్నూర్, ఫిబ్రవరి 20 : కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారెంటీలను ఎప్పటిలోగా అమలు చేస్తారో స్పష్టం చేయాలని ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి అన్నారు. నార్నూర్, గాదిగూడ మండలాల్లో మంగళవారం ఆమె పర్యటించారు. గాదిగూడ రైతు వేదికలో 28, నార్నూర్ మండల పరిషత్ కార్యాలయంలో 51 మంది లబ్ధిదారులకు మంజూరైన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు జాడలేకుండా పోతుందని ఆరోపించారు. ఆరు గ్యారెంటీలను అమలు చేస్తే ప్రజలకు లబ్ధి చేకురుతుందన్నారు. కేసీఆర్ ప్రభుత్వం అమలు చేసిన పథకాలు మాత్రమే కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. అనంతరం రాజుల్‌గూడ గ్రామంలో ప్రవీణ్ కుటుంబాన్ని పరామర్శించారు. కుటుంబానికి అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ ఆడ చంద్రకళారాజేశ్వర్, కనక మోతుబాయి, వైస్ ఎంపీపీ మర్సువనే యోగేశ్, తహసీల్దార్లు జాడి రాజాలింగం, విజయనందం, ఎంపీడీవోలు జవహర్, రామేశ్వర్, ఇంద్రవెల్లి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నాగోరావ్, మండలాధ్యక్షుడు మెస్రం హన్మంత్‌రావ్, పూసం బాదిరావ్, ఎంపీటీసీలు, మాజీ సర్పంచ్‌లు, నాయకులు, కార్యకర్తలు, ఆయా శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

'గుర్తింపు' పత్రం అందించాలి

మాట్లాడుతున్న టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు మల్రాజు శ్రీనివాసరావు

రెబ్బెన, ఫిబ్రవరి 20 : సింగరేణిలో ఎన్నికలు నిర్వహించి రెండు నెలలు గడుస్తున్నా గుర్తింపు సంఘంగా గెలిచిన ఏఐటీయూసీకి గుర్తింపు సంఘం పత్రం ఇవ్వలేదని, సెంట్రల్ డిప్యూటీ లేబర్ కమిషనర్ అందించాలని టీబీజీకేఎస్ బెల్లంపల్లి ఏరియా ఉపాధ్యక్షుడు మల్రాజు శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. గోలేటి టీబీజీకేఎస్ కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడారు. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ సర్కారు ఎన్నికలు వాయిదా వేయాలని కోర్టును కొరినప్పటికీ ఎన్నికలు వెంటనే నిర్వహించాలని కోర్టు ఆదేశించడంతో నిర్వహించినట్లు చెప్పారు. పూర్తయి రెండు నెలలు గడుస్తున్నా గుర్తింపు పత్రం ఇవ్వకపోవడం సరికాదన్నారు. గెలిచిన యూనియన్‌తో యాజమాన్యం సమావేశాలు నిర్వహిస్తేనే సమస్యలు పరిష్కారమవుతాయని తెలిపారు. ఈ సమావేశంలో టీబీజీకేఎస్ ఏరియా నాయకులు మాంతు సమ్మయ్య, ఓరం కిరణ్ పాల్గొన్నారు.

సమ్మక్క-సారలమ్మ జాతరకు ఏర్పాట్లు

దహెగాం, ఫిబ్రవరి 20 : మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో నేటి నుంచి ప్రారంభమవనున్న సమ్మక్క-సారలమ్మ జాతరకు నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు. మండల కేంద్రంలోని రావుమల్లన్న వాగు సమీపంలో నిర్వహించే జాతరతో పాటు పంబాపూర్, కొంచవెల్లి, రాంపూర్, తదితర గ్రామాల్లో బుధ, గురువారాల్లో జాతర జరుగనున్నది. సంప్రదాయ పద్ధతిలో పూజలు నిర్వహించి, వనదేవతలను గద్దెలపై ప్రతిష్ఠించనునారు. ఈ జాతర వేడుకల్లో భక్తులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

రెబ్బెన, ఫిబ్రవరి 20 : మండలంలోని లక్ష్మీపూర్ శివారు, పల్లవి ఫ్యాక్టరీ వెనుకాల, నక్కలగూడ గ్రామాల్లో సమ్మక్క-సారలమ్మ గద్దెల జాతరకు గద్దెలు ముస్తాబవడంతో పాటు ఏర్పాట్లు పూర్తయినట్లు లక్ష్మీపూర్ వన దేవతల పూజారులు గొల్లపెల్లి సత్తమ్మ, దేవర వినోద్ స్వామి తెలిపారు. భక్తులకు మంచినీటి ఏర్పాటుతో పాటు టెంట్లు ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

కాగజ్‌నగర్ టౌన్, ఫిబ్రవరి 20 : మండలంలోని పెద్ద వాగు సమీపంలో సమ్మక్క-సారలమ్మ జాతరకు నిర్వహణ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తయ్యాయి. తాగునీరు, క్యూలైన్లు, వసతులు కల్పించారు. గద్దెలకు రంగులు వేసి ముస్తాబు చేశారు. మున్సిపల్ ఆధ్వర్యంలో రోడ్డు శుభ్రం చేసి, ఎప్పటి కప్పుడు చెత్త తొలగించారు.

గోడప్రతుల విడుదల..

తిర్యాణి, ఫిబ్రవరి 20 : మండలంలోని కన్నేపల్లి పంచాయతీ పరిధి చిన్న అరటిపల్లి స్టేజీ వద్ద నిర్వహించనున్న సమ్మక్క-సారలమ్మ జాతరకు సంబంధించిన వాల్ పోస్టర్లను మంగళవారం పీఏసీఎస్ చైర్మన్ చుంచు శ్రీనివాస్, కమిటీ సభ్యులతో కలిసి నిర్వహణ కమిటీ గౌరవ అధ్యక్షురాలు, మాజీ జడ్పీటీసీ వెడ్మ కమల, అధ్యక్షుడు వెడ్మ భగవంతరావు విడుదల చేశారు. ఈ సందర్భంగా కబడ్డీ, వాలీబాల్ పోటీలను సైతం నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం ఉపాధ్యక్షుడు మార్నేని తిరుపతి, ప్రధాన కార్యదర్శి రారాజు, ఆలయ పూజారులు బొమ్మగోని సత్తయ్య గౌడ్, మాజీ సర్పంచ్ వెడ్మ మమత, కరిగంటి బాపు, ఆదివాసీ ఉపాధ్యాయ సంఘ నాయకులు కోట్నాక ప్రవీణ్ కుమార్, కన్నెపల్లి గ్రామ పటేల్ వెడ్మ శంకర్, ఆదివాసీ సంఘాల నాయకులు కుర్సెంగ బాదిరావు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

విజయవంతం చేయాలి

తిర్యాణి, ఫిబ్రవరి 20 : జిల్లా కేంద్రంలో ఈ నెల 22న నిర్వహించనున్న విజయ సంకల్ప యాత్రను విజయవంతం చేయాలని గడలపల్లి ఎంపీటీసీ, బీజేపీ జిల్లా నాయకుడు సార రమేశ్ గౌడ్ మంగళవారం తెలిపారు. ఎమ్మెల్యే రాజా సింగ్, మాజీ మంత్రి ఈటల రాజేందర్ హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. ఎస్టీ మోర్చా జిల్లా కార్యదర్శి గేడం సుభాష్, బీజేపీ మండల ఉపాధ్యక్షుడు తొడసం భాస్కర్, బీజేవైఎం మండలాధ్యక్షుడు వల్క శ్రీధర్ పాల్గొన్నారు.

లింగాపూర్, ఫిబ్రవరి 20 : విజయ సంకల్ప యాత్రను విజయవంతం చేయాలని బీజేపీ మండలాధ్యక్షుడు రాథోడ్ రమేశ్ కోరారు. మండల ప్రజలు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు అంబారావు, రామారావు, దస్రు, జయవంతరావు తదితరులు పాల్గొన్నారు.

సమాచారం ఇవ్వలేదని కోర్టుకు..

ఆసిఫాబాద్, ఫిబ్రవరి 20 : జిల్లాలో ఒప్పంద ప్రాతిపదికన నియమించిన ఉద్యోగుల వివరాలివ్వాలని గతేడాది మంచిర్యాల జిల్లా మందమర్రి గ్రామానికి చెందిన రమేశ్ సమాచారం హక్కు చట్టం కింద కలెక్టర్‌కు దరఖాస్తు చేసుకున్నాడు. తాత్కాలిక ఉద్యోగుల పీఎఫ్, ఈఎస్ఐ, ఈపీఎఫ్‌తో పాటు ఉద్యోగ నియామకాల గురించి దరఖాస్తు చేసుకోగా.. ఇందుకు కలెక్టర్ ఆర్టీఐ చట్టం 6(3) పరిధిలో, ఉపాధి కల్పనాధికారి రవికృష్ణకు బదిలీ చేశారు. గతేడాది ఆగస్టు 5న సమాచారం కోసం రూ. 16 వేలు చెల్లించాలని అధికారులు కోరడంతో రమేశ్ డీడీ తీసి అందజేశాడు. సదరు అధికారి సమాచారం ఇవ్వకపోవడంతో ఆయన హైకోర్టును ఆశ్రయించాడు. దరఖాస్తుదారుడు కోరిన వివరాలు ఇస్తామని అధికారులు కోర్టులో ఒప్పుకున్నారు. 2022-23 నియామకాల గురించి అడిగితే 2016-2022 వరకు ఇవ్వడంతో కోర్టులో రమేశ్ ధిక్కరణ కేసు వేశారు. మరోవైపు కేసు వాపస్ తీసుకోవాలని ఉపాధికల్పనాధికారి, మరికొందరు ఇంటికి వెళ్లి బెదిరించడంతో సదరు వ్యక్తి పోలీసులను ఆశ్రయించినా కేసు నమోదు చేయలేదని బాధితుడు పేర్కొన్నాడు. కోర్టు ధిక్కరణ కేసులో భాగంగా 07.03.2024న వ్యక్తిగతంగా కలెక్టర్ హాజరయ్యేలా నోటీసులు అందజేయాలని కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా జడ్జికి ఉత్తర్వులు జారీ అయ్యాయి.

రికార్డుల పరిశీలన

రికార్డులను పరిశీలిస్తున్న జడ్పీ సీఈవో అనిల్‌కుమార్

చింతలమానేపల్లి, ఫిబ్రవరి 20 : జడ్పీ సీఈవోగా బాధ్యతలు చేపట్టిన అనిల్ కుమార్ మంగళవారం మొదటిసారిగా మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా పలు రికార్డులను పరిశీలించారు. గ్రామాల్లో జరుగుతున్న పలు రకాల పనుల గురించి అడిగి తెలుసుకున్నారు. పనులపై నిర్లక్ష్యంగా వ్యవహరించవద్దని అధికారులకు సూచించారు. ఆయన వెంట ఎంపీడీవో కోట ప్రసాద్, ఎంపీపీ డుబ్బుల నానయ్య, జూనియన్ అసిస్టెంట్ పెంటు, పంచాయతీ రాజ్ అధికారులు, తదితరులున్నారు.

బెజ్జూర్‌లో..

బెజ్జూర్, ఫిబ్రవరి 20 : బెజ్జూర్ ఎంపీడీవో కార్యాలయాన్ని జడ్పీ సీఈవో సందర్శించారు. ఆయనకు ఎంపీడీవో మాధవి, సిబ్బంది పుష్పగుచ్ఛం అందించారు. ఈ కార్యక్రమంలో ఏవో తోటాజి, ఎంపీవో రమేశ్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

108 సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి

కిట్లను పరిశీలిస్తున్న రాష్ట్ర క్వాలిటీ డిపార్ట్‌మెంట్ అధికారి కిశోర్, జిల్లా మేనేజర్ సామ్రాట్

రెబ్బెన, ఫిబ్రవరి 20 : 108 సిబ్బంది ఎల్లవేళలా అప్రమత్తంగా ఉండాలని ఆ వాహనాల రాష్ట్ర కార్యాలయ క్వాలిటీ డిపార్ట్‌మెంట్ అధికారి కిశోర్ సూచించారు. రెబ్బెన పీహెచ్‌సీ వద్ద 108 వాహనాన్ని మంగళవారం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అంబులెన్స్ వాహనాల ప్రోగాం మేనేజర్ సామ్రాట్‌తో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వైద్య పరికరాలు, వివిధ రకాల మందులు, మెడికల్ కిట్లు, రికార్డులను పరిశీలించారు. అనంతరం వాహనాల సిబ్బందికి పలు సలహాలు, సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో పైలెట్‌లు సంతోష్, శంకర్, ఈఎంటీ శివకృష్ణ ఉన్నారు.

జిల్లాస్థాయి సైన్స్ టాలెంట్ టెస్ట్

బహుమతి అందుకున్న విద్యార్థి గుండేటి వర్షిత్

కాగజ్‌నగర్ ఎస్పీఎం కాలనీ, ఫిబ్రవరి 20 : కాగజ్‌నగర్ పట్టణంలోని పెట్రోల్ పంప్ ఏరియాలో గల జడ్పీఎస్ఎస్ పాఠశాలలో మంగళవారం రాష్ట్ర ఫిజికల్ సైన్స్, బయోలాజికల్ సైన్స్ ఫోరం ఆధ్వర్యంలో జిల్లాస్థాయి సైన్స్ టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ప్రతిభ చూపిన మోడల్ స్కూల్ విద్యార్థి గుండేటి వర్షిత్ (ప్రథమ), కాగజ్‌నగర్ పెట్రోల్ పంప్ ఏరియా జడ్పీఎస్ఎస్ పాఠశాల విద్యార్థిని బీ అనూష (ద్వితీయ) బహుమతులు అందుకున్నారు. వీరు ఈ నెల 24న హైదరాబాద్‌లో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్ వెంకట రాజయ్య, తౌటం శ్యాంసుందర్, భాను ప్రకాశ్, జడే ప్రవీణ్, రోజారాణి, జడే కేశవ్, సాబీర్, అనిష్ అహ్మద్, కిషన్, తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి పెద్దపీట

పనులు ప్రారంభిస్తున్న విశ్వప్రసాద్‌రావు, అజ్మీరా శ్యామ్‌నాయక్

రెబ్బెన, ఫిబ్రవరి 20 : గ్రామాల అభివృద్ధికి సర్కారు పెద్దపీట వేస్తుందని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు కొక్కిరాల విశ్వప్రసాద్‌రావు, నియోజకవర్గ ఇన్‌చార్జి అజ్మీరా శ్యామ్‌నాయక్ తెలిపారు. రెబ్బెనలో మంగళవారం ఉపాధి హామీలో భాగంగా రూ.26 లక్షలతో సీసీ రోడ్లు పనులు ప్రారంభించారు. ప్రతి గ్రామంలో సీసీ రోడ్లు, డ్రైనేజీలు నిర్మించేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు లావుడ్య రమేశ్, బ్లాక్ కాంగ్రెస్ మండలాధ్యక్షుడు దుర్గం దేవాజీ, గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు మోడెం సుదర్శన్‌గౌడ్, మాజీ సర్పంచ్ గంటుమేర, నాయకులు మోడెం చిరంజీవిగౌడ్, వెంకటేశ్వరగౌడ్, రాజేశ్, జమ్మి పాల్గొన్నారు.

ప్రజా ప్రయోజనాలకు స్థలాన్ని అప్పగించాలి

డీఆర్వోకు వినతి పత్రం అందజేస్తున్న ఎల్లూర్ గ్రామస్తులు

ఆసిఫాబాద్, ఫిబ్రవరి 20 : పెంచికల్‌పేట మండలం ఎల్లూరు సమీపంలోని సర్వే నంబర్ 61 లో గల భూమిని ప్రజా ప్రయోజనాలకు అప్పగించాలని ఆ గ్రామ ప్రజలు జిల్లా రెవెన్యూ అధికారి లోకేశ్వర్ రావును కోరారు. ఈ మేరకు ఆయనకు వినతి పత్రం అందజేశారు. ఈ సర్వే నెంబర్‌లో 1250 ఎకరాల రెవెన్యూ భూమి ఉందన్నారు. ఇప్పటికే కొందరు పేదలు సాగులో ఉన్నారని, వారికి 30 ఏండ్ల క్రితం పట్టాలు ఇచ్చారని తెలిపారు. మిగతా భూమిని ప్రజా ప్రయోజనాలకు ఉపయోగించే ఉద్దేశంతో గతంలో మండల కేంద్రంలోని అన్ని రకాల కార్యాలయాల కోసం ప్రతిపాదనలు పంపించారన్నారు. ఇదిలా ఉండగా అటవీశాఖ అధికారులు ఆ భూమి తమకు సంబంధించినదేనంటూ బెదిరింపులకు గురి చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పెంచికల్‌పేట ఎంపీటీసీ దూగుంట రాజం, మాజీ సర్పంచ్ గణపురం కావ్య నాగేశ్వర్, అంబేద్కర్ సంఘం గ్రామ అధ్యక్షుడు దుర్గం సంతోష్, వివిధ పార్టీల నాయకులు మధూకర్, శ్రీనివాస్, తిరుపతి, సముద్రాల రాజన్న, రామచందర్ పాల్గొన్నారు.

అభ్యాసన ఫలితాలకు కృషిచేయాలి

రెబ్బెన, ఫిబ్రవరి 20 : పిల్లల్లో అభ్యాసన ఫలితాల కోసం ఉపాధ్యాయులు కృషిచేయాలని రెబ్బెన జడ్పీఎస్ఎస్ కాంప్లెక్స్ హెచ్ఎం విజయరాణి సూచించారు. రెబ్బెన మండల కేంద్రంలోని జడ్పీ హైస్కూల్‌లో మంగళవారం రూమ్ టూ రీడ్ కథల పుస్తకాలను ఉపాధ్యాయులకు అందించారు. పిల్లలకు చదవడం అలవాటు అయ్యేలా చర్యలు తీసుకోవాలని, పుస్తకాలు రొటేషన్ వల్ల పిల్లలకు కొత్త పుస్తకాలు చదివే అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ పరిధిలోని వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రూ.11 కోట్లు మంజూరు

తిర్యాణి, ఫిబ్రవరి 20 : ఉపాధి హామీ ద్వారా 2024-25 ఆర్థిక సంవత్సరానికి గాను రూ.11 కోట్లు మంజూరైనట్లు ఈజీఎస్ ఏపీవో షాకీర్ ఉస్మానియా, ఈసీ రజిత మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో రూ.6.80 కోట్లు మట్టి, ఇతర వ్యవసాయ పనుల కోసం కాగా, మరో రూ.4.20 కోట్లు మెటీరియల్ పనులకు మంజూరైనట్లు వివరించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో రానున్న ఏప్రిల్‌లో పనులు ప్రారంభమై, వచ్చే ఏడాది మార్చి చివరి నెలలో ముగించనున్నట్లు తెలిపారు. అలాగే గతేడాది మార్చిలో 100 రోజులు నిండని కూలీలకు మాత్రం ఫిబ్రవరి, మార్చి నెలలోగా వంద రోజులు నిండేలా పనులు కల్పించడం జరుగుతుందని తెలిపారు. అలాగే ప్రతి కూలీకి వంద రోజుల పని కల్పించడంతో పాటు పనుల్లో నాణ్యత ఉండేలా చూడాలని ఈజీఎస్ సిబ్బందికి సమీక్షా సమావేశం నిర్వహించి ఆదేశించినట్లు ఎంపీడీవో వేముల మల్లేశ్ తెలిపారు.

రెండు వాహనాలు ఢీ

వాంకిడి, ఫిబ్రవరి 20 : మండలంలోని గణేశ్‌పూర్ గ్రామం వద్ద హైదరాబాద్-నాగ్‌పూర్ జాతీయ రహదారిపై మంగళవారం ఉదయం రెండు ఐచర్ వాహనాలు ఎదురెదురుగా ఢీ కొట్టుకున్నాయి. దీంతో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. చంద్రాపూర్ నుంచి మంచిర్యాల వైపు వస్తున్న ఐచర్, వాంకిడి నుంచి చంద్రాపూర్ వైపు వెళ్తున్న ఐచర్ వాహనలు ఎదురెదురుగా ఢీ కొట్టున్నాయి. ఈ ప్రమాదంలో ఐచర్ వాహనాల ముందు భాగాలు దెబ్బతినగా, డ్రైవర్లకు తీవ్ర గాయాలయ్యాయి. వారిని స్థానికుల సాయంతో మండల కేంద్రంలోని ప్రభుత్వ దవాఖానకు తరలించారు. విషయం తెలుసుకున్న వాంకిడి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఇద్దరికి జీవిత ఖైదు

సిర్పూర్(యు), ఫిబ్రవరి 20 : హత్య కేసులో ధనోరా గ్రామానికి చెందిన సెడ్మాకి నాందేవ్, సెడ్మాకి భీంరావ్‌కు జీవిత కాల జైలు శిక్షతో పాటు చేరో రూ.4 వేల జరిమానా విధిస్తూ ఆసిఫాబాద్ సెషన్ కోర్టు నాయమూర్తి రమేశ్ మంగళవారం